సీజనల్ వ్యాధులు.. జాగ్రత్తలు తప్పనిసరి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.శ్రీకాంత్



హఫీజ్‌పేట్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లోకి వెలుతురు వచ్చే విధంగా చూడాలని హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా.శ్రీకాంత్ సూచించారు. వర్షాకాలంలో ఎక్కువగా జలుబు, దగ్గు, జ్వరాలు వస్తాయని గోరు వెచ్చని నీటిని తాగాలని , తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా వ్యాధులు వస్తాయి కనుక నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు.హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజు సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఒక మెడికల్ ఆఫీసర్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్స్, ఒక డీఈఓ, అకౌంటెంట్ ఉన్నారు.

పీహెచ్‌సీలో చేసే రక్త పరీక్షలు..

డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, పూర్తి రక్తం చిత్రం, షుగర్, కాలేయం, ఊపిరి తిత్తులు, కిడ్నీ, సీఆర్‌పి, హెచ్‌ఐవీ వంటి రక్త పరీక్షలు చేయడం జరుగుతుంది.

◆ రోజుకు పది మందికి పైగా రక్త పరీక్షలు చేస్తున్నారు.

‘ఎస్కీ’లో జీఐఎస్‌పై స్వల్పకాలిక సర్టిఫికేషన్ కోర్సులు

- జూన్ 10 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ఎస్కీ డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్)లో స్వల్పకాలిక కోర్సులను అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మంగళవారం వివరించారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో 6వారాల, 4 వారాల వ్యవధితో ఉండే రెండు ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కోర్సులను జూన్10వ తేదీ నుంచి నిర్వహించాలని తలపెట్టినట్లు పేర్కొన్నారు.అన్ని రకాల డేటాను మ్యాప్ చేసే ఏకైక వ్యవస్థ జీఐఎస్ కాబట్టి మెరుగైన కమ్యూనికేషన్ విధానంతో కూడిన సిలబస్ రూపొందించడం జరిగిందన్నారు.ఈ కోర్సులో చేరాలనుకునేవారు ఎల్‌సీఈ/ఎల్ఎంఈతో పాటుగా బీఈ, బీటెక్/ప్లానింగ్ లేదా ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ అర్హత, ఎంటెక్ టౌన్‌ప్లానింగ్, రిమోట్ సెన్సింగ్ జియోమ్యాటిక్స్, ఎన్విరాన్‌మెంట్ కలిగిన అభ్యర్థులు బీఎస్‌సీ కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్స్, ఎంఎస్‌సీ జీఓఇన్ఫర్‌మ్యాటిక్స్ కలిగిన అభ్యర్థులకు జీఐఎస్ సర్టిఫికేషన్ కోర్సు చేయడానికి అర్హతగా నిర్ణయించినట్లు ఆయన వివరించారు.

బీజేపీ నాయకుల సంబరాలు

రాయదుర్గం: కేంద్రంలో బీజేపీ ఘనవిజయం, తెలంగాణ రాష్ట్రంలో గతంలో కంటే ఎక్కువ స్థానాలు పొందడం, చేవెళ్ల పార్లమెంటులో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించడంతో టెలికామ్‌నగర్‌లో పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం కాలనీలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి, దినేష్‌యాదవ్, మురళి, సుభాష్, అనురాగ్,రామకృష్ణ, మానవ్, వెంకటేష్, రవితోపాటు స్థానికులు పాల్గొన్నారు.



శాశ్వత పరిష్కారాన్ని చూపండి



రోడ్డుపై నిలిచిన నీటిని మళ్లిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయం అవుతున్నాయి. దాంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రధానంగా శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ మీదుగా రింగ్‌రోడ్డు వరకు రేడియల్ రోడ్డును అభివృద్ధి చేశారు. రోడ్డు నిర్మాణ సమయంలో రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు వెళ్లేందుకు కాలువలను నిర్మించారు. కాగా ఈ కాలువలో నల్లగండ్ల ప్రాంతంలోని పలు కాలనీలకు చెందిన డ్రైనేజీ నీరు చేరుతుంది. ఇక చిన్నపాటి వర్షాలకు ఆ నీరు కాలువలోకి చేరడంతో సమస్య జఠిలంగా మారుతుంది. దాంతో తెల్లాపూర్ మార్గంలోని కమాన్ వద్ద వర్షపు నీరు, డ్రైనేజీ నీరు రోడ్డుపైకి పెద్ద ఎత్తున చేరుతుంది. రోడ్డుపై నీరు చేరినప్పుడు మాత్రమే అధికారులు జేసీబీతో కాలువ చేసి ఆ నీటిని మళ్లిస్తున్నారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో డ్రైనేజీ పైపులైన్‌లు వేసి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీలు ఇచ్చినప్పటికీ దానిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. అధికశాతం టీవీలో ఎన్నికల ఫలితాలను చూస్తూ ఇంటికే పరిమితం అవడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లన్నీ బోసిపోయాయి. - సుభాష్‌నగర్

శేరిలింగంపల్లిలో బీజేపీ హవా

ఒక్క రౌండ్ మినహా అన్ని రౌండ్లలో ఆధిక్యం • కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి భారీ మెజారిటీ

గచ్చిబౌలి: బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి శేరిలింగంపల్లి ఓటర్లు జై కొట్టారు. చేవెళ్ల నియోజకవర్గంలో భాగమైన శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు 24 రౌండ్లలో పూర్తయింది. 23 రౌండ్లు, పోస్టల్ బ్యాలెట్‌లోను కొండా విశ్వేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించి తిరుగులేని విజయాన్ని నమోదు చేసుకున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 7,58,102 ఉండగా 3,33,181 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీకి 1,89,614 ఓట్లు, కాంగ్రెస్‌కు 1,10,596, బీఆర్ఎస్‌కు కేవలం 44,115 ఓట్లు మాత్రమే వచ్చాయి. 79,018 ఓట్ల మెజారిటీని కొండా విశ్వేశ్వర్ రెడ్డి సాధించారు.12వ రౌండ్‌లో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థి 2,901 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు.మిగిలిన అన్ని రౌండ్లు, పోస్టల్ బ్యాలెట్‌లో బీజేపీకి 5241 ఓట్ల స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించింది.రెండో రౌండ్‌లో 7369, మొదటి రౌండ్‌లో 6800, 14 రౌండ్‌లో 6222, 16వ రౌండ్‌లో 7632 ఓట్ల మెజారిటీ దక్కింది. మొదటి రౌండ్ నుంచి చివరి లెక్కింపు పూర్తయ్యే వరకు బీజేపీకి అధికార కాంగ్రెస్ పోటీ ఇవ్వలేక పోయింది.

బోల్తాపడ్డ బీఆర్ఎస్

గత డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ 54 వేల భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌పై విజయం సాధించారు. ఆరు నెలల తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ బోల్తా పడిందనే చెప్పాలి. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు కేవలం 44,115 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీలో వచ్చిన మెజార్టీని దాటకపోవడం బీఆర్ఎస్ శ్రేణులను నిరుత్సాహంలోకి నెట్టింది. సిట్టింగ్ ఎమ్మెల్యే, కార్పొరేటర్లు ఉన్నా ప్రభావం చూపలేకపోయారు. మోదీ హవాతో పాటు విశ్వేశ్వర్ రెడ్డి తన సొంత ఇమేజ్‌తో గెలిచినట్టు చెప్పవచ్చు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: భారతదేశంలో ఫ్యాషన్ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ‘మనూ’ డిజైనింగ్ కోర్సుల ఇన్‌చార్జీ సమనా మూస్వి మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో మనూలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను ప్రారంభించడం జరిగిందన్నారు. ‘మనూ’, సమనా కాలేజ్ ఆఫ్ డిజైన్ సహకారంతో నాలుగేళ్ళ (యూజీ కోర్సు) బీఎస్సీ, రెండు ఏళ్ళ డిప్లొమో కోర్సు, ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ డిజైనింగ్‌లో ఒక ఏడాది కాలపరిమితితో కూడిన సర్టిఫికెట్ కోర్సును నిర్వహించడం జరుగుతోందన్నారు. 10ప్లస్ 2 లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులన్నారు. ఇది కాకుండా ఉర్దూ యూనివర్శిటీ మోడల్ స్కూల్, పాలిటెక్నిక్, గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు ప్రత్యేక మినహాయింపు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌తో పాటు ప్రాస్పెక్టస్ యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. దరఖాస్తు సమర్పించడానికి చివరితేదీగా జూన్30గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 81065 28786లో సంప్రదించాలన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్ల కూల్చివేత

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చివేసినట్లు రాజేంద్రనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కె. రవికుమార్ తెలిపారు. ఇటీవల బాబుల్‌రెడ్డి నగర్‌లో గోడకూలిన ఘటనలో చిన్నారులు మృతి చెందిన విషయం విషాదకరమన్నారు. శిథిలావస్థకు చేరిన ప్రహరీలను, ఇళ్లను స్వచ్ఛందంగా తొలగించుకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నీటి వృథా

జీడిమెట్ల: మంచినీటి పైపులైన్ పగిలిపోవడంతో నీరు రోడ్డుపై వృథాగా పోతుంది. జీడిమెట్ల ఫేజ్-5లోని రాంరెడ్డినగర్ రోడ్డులో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో వేలాది లీటర్ల మంచినీరు వృధాగా పోయింది. అధికారులు స్పందించి మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

8న చేప ప్రసాదం పంపిణీ

నారాయణఖేడ్: మృగశిర కార్తె సందర్భంగా నిజాంపేట్ మండల కేంద్రంలో ఈ నెల 8న ఉదయం 7.30 గంటల నుంచి చేప ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తడకంటి పర్వాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శంకర్‌గౌడ్, లింగాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పూర్వీకుల నుంచి ఆనవాయితీగా ప్రసాదం పంపిణీ చేస్తున్నామన్నారు. దగ్గు ఉబ్బసం వ్యాధి ఉన్న బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రపంచ స్థాయి ర్యాంకింగ్స్‌లో ‘హెచ్‌సీయూ’

గత ఏడాది కంటే మెరుగైంది

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: ప్రపంచ స్థాయి ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ 801-850 ర్యాంక్‌లో స్థానం పొందింది. కాగా ‘సిటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ’ సూచికలో హెచ్‌సీయూకు ప్రపంచంలో 335వ స్థానం లభించడం విశేషం. ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరుపొందింది. ఉన్నత విద్యా సంస్థలలో ర్యాంకింగ్స్‌ను క్వాక్వారెల్లి సైమండ్స్(క్యూఎస్) యూనివర్శిటీ ర్యాంకింగ్స్‌ను ప్రతియేటా ప్రకటిస్తుంటారు. అందులో భాగంగా 2025 ర్యాంకింగ్స్‌ను ప్రకటించారు. క్యూఎస్ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్‌లో గత ఏడాది కంటే మెరుగైన స్థానం రావడం సంతోషించదగ్గవిషయని హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. 2025 ఎడిషన్‌లో సిటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ సూచికలో 335 ర్యాంక్‌ను పొందిందని, 2024లో 372వ ర్యాంక్ సాధించిందని ఆయన గుర్తు చేశారు. ఇది పురోగతికి నిదర్శనమన్నారు.

కొండాకు శుభాకాంక్షలు

గచ్చిబౌలి: భారీ మెజారిటీతో గెలుపొందిన చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, శేరిలింగంపల్లి ఇంచార్జీ ఎం.రవి కుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్లలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయనను కలిసి సన్మానించారు. తెలంగాణలో బీజేపీ తిరుగులేని విజయాన్ని నమోదు చేసిందని రవికుమార్ పేర్కొన్నారు.





శేరిలింగంపల్లిలో కురుస్తున్న వర్షం

ఈదురు గాలి..వాన

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి, చందానగర్‌లలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులుతో పాటు వర్షం కురిసింది. ఉదయం ఉక్కపోత, సాయంత్రం చల్లదనంతో వాతావరణం మారిపోయింది. గంటసేపు ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో రోడ్లు జలమయ్యాయి. కాలువలు పొంగి పొర్లాయి. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీరు చేరి కొంతమేర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. జీహెచ్ఎంసీ సిబ్బంది వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్‌లు వికారాబాద్‌లోని గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్తుల్లో మరిన్ని ఉన్నత పదవులు దక్కించుకుని ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. ఏ-బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్ కుమార్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణికొండ: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు, నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రాజేంద్రనగర్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ జన్మదినం సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన దళిత సంఘాల నాయకులు మంగళవారం ఉదయం ఆయనను కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత ఫిజియోథెరపీ చికిత్స

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, వివేకానందనగర్ కాలనీలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఫిజియోథెరఫి చికిత్స ఉచితంగా చేయనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్యాప్సికో, జిహెచ్‌యంసి, హెల్పేజ్ ఇండియా, రిక్రియేషన్ క్లబ్, ఎంపిసిఆర్, లయన్స్‌క్లబ్‌ల సంయుక్త సహకారంతో నిర్వహించే ఈ ఫిజియోథెరఫి సెంటర్ నందు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చికిత్స అందజేయనున్నట్లు తెలిపారు. మెడ, మోకాళు, ఒళ్లు, కాళ్లు, కీళ్ళు నొప్పులు వంటి తదితర నొప్పులకు చికిత్స చేయనున్నట్లు, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రైవేట్ ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్

పటాన్‌చెరు టౌన్: అనుమతులు లేకుండా అడ్మిషన్లు ఇస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న వేళ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల, కళాశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని అదేవిధంగా ఫీజులో నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా కొన్ని బడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీగా వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25% ఉచితంగా విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు , విజయ్ ,అనూష, మౌనిక, హారిక తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం చిన్న కంజర్ల గ్రామానికి చెందిన వీరస్వామి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.అయితే గత నెల 12వ తేదీన భార్య లక్ష్మితో గొడవపడ్డాడు.దీంతో భార్య లక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుండి ఒంటరిగా ఉంటున్న వీరస్వామి గత నెల 14వ తేదీన ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా వీరస్వామి ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం తమ్ముడు అదృశ్యంపై అన్న యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాలను తరలించండి



మోతీనగర్ శంకరమఠం సమీపంలో డ్రైనేజీ వ్యర్థాలు

మోతీనగర్: మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసిన తర్వాత వ్యర్థాలను రోడ్డు మధ్యలోనే వదిలి వేయటంతో సమీప నివాసితులకు, వాహన చోదకులకు ప్రమాదకరంగా తయారైంది. మూసాపేట డివిజన్ అవంతినగర్, మోతీనగర్ శంకర మఠం సమీపంలో గత కొన్ని రోజుల క్రిందట మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేసి మూతలు ఏర్పాటు చేసి వ్యర్థాలను అక్కడే వదిలివేశారు. దీంతో రాత్రి వేళల్లో ఇబ్బందికరంగా తయారైంది. అధికారులు వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఔటర్ ఎక్కిన ఆటో సీజ్



సీజ్ చేసిన ఆటోతో సీఐ హరికృష్ణారెడ్డి

మణికొండ: ఔటర్‌పై ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు అనుమతి లేక పోయినా నార్సింగి వద్ద ఎక్కి, పోలీస్ అకాడమీ వద్ద దిగటంతో పాటు ర్యాష్‌గా నడిపిన డ్రైవర్‌పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేశారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఔటర్ రింగ్ రోడ్డుపైకి అనుమతి లేకున్నా ఆటో ఎక్కడంతో పాటు నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడిపిన నేనావత్ రాజేందర్‌పై టోల్‌గేట్ ఇంచార్జి ఫిర్యాదు చేశారన్నారు. దాంతో అతనిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు.

విద్యుత్ సమస్యలుంటే..

చందానగర్ ఏడీఈ శ్యాంరావు :	8332872962
హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ ఏఈ ఇంద్రసేనారెడ్డి :	8985564147
చందానగర్ సబ్‌స్టేషన్ ఏఈ రాజేందర్ :	9440813167
వేమన కాలనీ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి :	8985564919
తారానగర్ సబ్‌స్టేషన్ ఏఈ సుమన్ :	9440156725
ఫ్యూజ్ ఆఫ్ కాల్ 24/7 :	9490153510

జలమండలి అధికారులు వివరాలు

హఫీజ్‌పేట్ : హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి శేరిలింగంపల్లి డివిజన్‌లో మంచినీటి, సివరేజ్ సమస్యలు ఉంటే కింద అధికారులకు తెలియజేయవచ్చు.

శేరిలింగంపల్లి డివిజన్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ :	9989989535
మాదాపూర్ సబ్ డివిజన్ :	
శరత్‌కుమార్ రెడ్డి (డీజీఎం, మాదాపూర్) :	9989988370
బి. యాదయ్య (మేనేజర్, మాదాపూర్) :	9154297400
నరేందర్‌రెడ్డి (మేనేజర్, గచ్చిబౌలి) :	7331185784
అభిషేక్ (మేనేజర్, నల్లగండ్ల) :	9154867438
సందీప్ కుమార్ (మేనేజర్, కొండాపూర్) :	9550731232
విక్రమ్ రెడ్డి (మేనేజర్, డోయన్స్) :	9989989382
చందానగర్ సబ్ డివిజన్ :	
టి. నాగప్రియ (డీజీఎం, మియాపూర్) :	9989996001
వి. సాయి చరిత (మేనేజర్, మియాపూర్) :	9154866702
ఎస్‌వీఎస్ సుబ్రమణ్యం రాజు (మేనేజర్, చందానగర్) :	9989989045
వై.సునీత (మేనేజర్, దీప్తిశ్రీనగర్) :	9154867431
పూర్ణేశ్వరి(మేనేజర్, హఫీజ్‌పేట్) :	7331185747
ఆర్సీ పురం సబ్ డివిజన్ :	
శివ కృష్ణ (డీజీఎం) :	7337350848
ఎం.జనార్దన్ (మేనేజర్, ఆర్సీపురం) :	9989991590
వి.ప్రవీణ్‌కుమార్ (మేనేజర్, పటాన్‌చెరువు) :	8790011977
మంచినీటి ట్యాంకర్ కోసం :	155313

హైటెక్స్ ఏరియా.. అధ్వానం

- దుర్గంధం వెదజల్లుతున్న మొండికుంట చెరువు
- పనిచేయని లైట్లు, వాకింగ్ ట్రాక్, విరిగిన కుర్చీలు
- చెరువు వద్ద మద్యం సేవిస్తున్న అల్లరిమూకలు

మాదాపూర్: నగరం నడిబొడ్డులో ఆకట్టుకోవాల్సిన చెరువు మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. మాదాపూర్‌లోని హైటెక్స్ వద్ద ఉన్న మొండికుంట చెరువు దాదాపు 4 ఎకరాలలో విస్తరించి ఉంది. సందర్శకుల కోసం చెరువు చుట్టూరా వాకింగ్ ట్రాక్, కుర్చీలు, లైట్లు ఏర్పాటు చేశారు. ఐతే నిర్వహణ లేకపోవడంతో వాకింగ్ ట్రాక్ ధ్వంసమైంది. లైట్లు వెలగడం లేదు. చెత్తను తెచ్చి చెరువు వద్ద పోసి కాలుస్తున్నారు. ఇక మురుగునీరు చెరువులోకి వెలుతున్నాయి. ఫెన్సింగ్ లేకపోవడం, గేటు ఏర్పాటు చేయకపోవడంతో పశువులు తిరుగుతున్నాయి. రాత్రి సమయాలలో మందుబాబులు ఉంటున్నారు. చెరువు పరిధి అస్తవ్యస్తంగా తయారైంది. ఇకనైనా అధికారులు స్పందించి చెరువును శుభ్రం చేయడంతో బాటు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.





వెలగని లైట్లు



చెరువు వద్ద చెత్తాచెదారం



అస్తవ్యస్తంగా మారిన చెరువు



మాదాపూర్ హైటెక్స్ వద్ద మొండికుంట చెరువు